ఎనిమిది గంటల కరెంట్ కూడా ఇవ్వట్లేదు
విద్యుత్ కోతలతో రైతుల ఆందోళన 7
రేగోడ్‌లో సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన అన్నదాతలు

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో పెట్టొద్దు
మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు 7

మల్లన్న సన్నిధిలో ఎంపీ కె.లక్ష్మణ్ ప్రత్యేక పూజలు 7



చేగుంట రైతు వేదిక వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఒక్క బస్తా కోసం...

7

- తెల్లవారుజాము నుంచే పడిగాపులు
- పోలీస్ పహారాలో యూరియా పంపిణీ
- కొన్నిచోట్ల టోకెన్లు కూడా దక్కని దైన్యం
- ఆగ్రహంతో నిరసనలు, ఆందోళనలు

మార్వాడీ ఆయిమాత జయంతిలో జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ చింతల్‌లో ఉన్న మార్వాడీల ఆరాధ్య దైవమైన ఆయిమాత ఆలయంలో సోమవారం నాడు అట్టహాసంగా ఆయి మాత జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఆయి మాత అమ్మవారికి జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మార్వాడీలు భక్తి శ్రద్ధలతో చేసిన జాగరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి వెంట మార్వాడీ సంఘం నాయకులు రఘురాం, మోతీలాల్ సోలంకి, మోహన్, సునీల్ మిట్టల్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ వద్ద నిర్వహించిన ఆయిమాత జయంతి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి

హెచ్‌ఎండీఏ భూములకు
కబ్జాల గండం

రూ. 400 కోట్ల విలువైన 80 ఎకరాలు అన్యాక్రాంతం

- బొల్లారం పారిశ్రామికవాడలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం 60 ఎకరాలు
- అదే సర్వే నంబర్లలోని మిగిలిన భూముల కబ్జా
- అధికారుల సహకారంతో అక్రమాలు
- గల్లీ నేతలను కోటీశ్వరులుగా మార్చిన దందా

ఐడీఏ బొల్లారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల కోసం కేటాయించిన హెచ్‌ఎండీఏ భూములు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకుంటున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులు, స్థానిక నేతల అండతో రూ. 400 కోట్లకు పైగా విలువైన 80 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. నిరుపేదల పేరుతో మొదలైన ఈ కబ్జా దందాలో గల్లీ స్థాయి నాయకులు రూ.కోట్లు గడిస్తున్నారు.



బొల్లారం పారిశ్రామికవాడలో అన్యాక్రాంతమయిన హెచ్‌ఎండీఏ భూములు

భూముల కబ్జా వెనుక కుట్ర

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో స్థానికులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు నివాసముంటారు. రెండు దశాబ్దాల క్రితం పారిశ్రామికవాడలో భవిష్యత్ ప్రజావసరాల నిమిత్తం ప్రభుత్వం పెద్దఎత్తున భూమిని హెచ్‌ఎండీఏకు బదిలీ చేసింది. వివిధ సర్వే నంబర్లలో 205.5 ఎకరాల భూమిని హెచ్‌ఎండీఏకు కేటాయిస్తూ 2007 డిసెంబరులో ఉత్తర్వులు జారీ చేశారు. తరువాత కాలంలో స్థలాలకు డిమాండ్, విలువ అమాంతం పెరగడంతో ఈ భూమిపై కబ్జా మాఫియా కన్ను పడింది.

నిరుపేదల పేరుతో దందా

పారిశ్రామికవాడలో నివసించే పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఈ సర్వే నంబర్లలో ఐదు కాలనీలకు 60 ఎకరాలు కేటాయించింది. వైఎస్ఆర్, కేబీఆర్, బీసీ కాలనీ, గాంధీనగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీల పేరుతో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇదే అదునుగా చేసుకుని అక్రమార్కులు మరో 75 ఎకరాలను కబ్జా చేశారు. కబ్జా చేసిన స్థలాలను 60, 75, 100 గజాల చొప్పున చిన్న ప్లాట్లుగా చేసి రూ. లక్షలకు అమ్ముకున్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులకు ఈ ప్లాట్లను భారీగా విక్రయించారు. కొన్నిచోట్ల

మిగతా 8వ పేజీలో

వీధి కుక్కల దాడిలో 17 మందికి గాయాలు

మెదక్ జిల్లా మాసాయిపేటలో రెచ్చిపోయిన శునకాలు



మాసాయిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మాసాయిపేటలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వీధిలో సోమవారం సంత నిర్వహిస్తారు. అలాగే, వినాయక మండపం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం పలువురు అక్కడ గుమిగూడారు. ఈ క్రమంలో ఎక్కడి నుంచి వచ్చాయో రెండు వీధి కుక్కలు గ్రామస్థులపై విచక్షణా రహితంగా దాడి చేసి కరిచాయి. మొత్తం 17 మందిని కరిచాయి. తీవ్రంగా గాయపడి వారిని హుటాహుటిన తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుక్కలు దాడి చేస్తుండటంతో భయాందోళనకు గురైన స్థానికులు తలోదిక్కు పారిపోయారు. మండల కేంద్రంలో వీధి కుక్కల బెడద అరికట్టాలని అధికారులకు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుక్కల దాడి ఘటనతో మండల కేంద్రంలో భయానక వాతావరణం నెలకొంది.



నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పదేళ్ల తర్వాత నల్లవాగు కాలువల్లో పూడిక తొలగింపు

చివరి ఆయకట్టుకూ సాగునీరు : ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో పూడిక తొలగించి ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ ఆయకట్టుకు సోమవారం ఆయన సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నామమాత్రంగా పూడికతీత పనులు చేపట్టి నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ప్రాజెక్టు కట్టపై పొదలు తొలిగించినట్లు రికార్డుల్లో నమోదుచేసి మూడుసార్లు నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. ఈ వానాకాలంలో ప్రాజెక్టు పూర్తిగా నిండినా కాలువలకు గండ్లు పడటంతో మరమ్మతులు, పూడికతీత పనులు చేసిన తర్వాతే నీటిని విడుదల చేశామని తెలిపారు. నీటి విడుదలపై రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్‌కుమార్, ఏఈలు శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లేష్, నాయకులు నర్సింహారెడ్డి, యాదవరెడ్డి, కృష్ణమూర్తి, విఠల్, మోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాసరావ్, జయరాజ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు మంత్రి ఆదేశం!

పలు ఆరోపణలు చేస్తూ మంత్రికి సిబ్బంది లేఖ 6
స్పందించిన దామోదర్ .. విచారణాధికారి నియామకం



శివంపేట వద్ద హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర్ రాజనరసింహ

హైవే 161పై ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేయండి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్/టేక్మాల్/జోగిపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి 161పై పలు గ్రామాల వద్ద ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎన్‌హెచ్‌ఏఐ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చౌటకూర్ మండలం శివంపేట, తాడ్దానిపల్లి చౌరస్తా, సుల్తాన్‌పూర్, అందోల్ మండలం అల్మాయిపేట, డాకూర్, టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి వద్ద హైవేపై ఫ్లై ఓవర్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఫ్లై ఓవర్‌లు, అండర్‌పాస్‌లు లేక జాతీయ రహదారిని దాటుతూ అనేకమంది ప్రమాదాల బారినపడుతున్నారని, దీనిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంతో పుల్కల్ మండలంలోని గ్రామాలతో పాటు సదాశివపేట, మునిపల్లి, జహీరాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు. సుల్తాన్‌పూర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే కోర్పోలు, ఉప్పరిగూడెం, బద్రిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని సూచించారు. శివంపేట వద్ద గ్రామానికి దూరంగా అండర్‌పాస్ వంతెనను నిర్మించడంతో నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. అందోల్ మండలం అల్మాయిపేట వద్ద వంతెన, డాకూర్ వద్ద హైవే నుంచి కిందకు దిగడానికి అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి వద్ద ఫ్లైఓవర్ లేకపోవడంతో మెదక్ వైపు వెళ్లేవారు కిలోమీటరు దూరంలోని అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద యూటర్న్ చేసుకోవాల్సి వస్తుందని వివరించారు. ఆయా ప్రదేశాల్లో వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట సంగారెడ్డి, అందోలు ఆర్డీవోలు రవీందర్‌రెడ్డి, పాండు, డీఎస్పీ సత్తయ్య, తహసీల్దార్‌లు అనుదీప్, తులసిరాం, ఆర్ఐ ప్రమోద్, సీఐ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ దేవీలాల్, మహేష్, సైట్ ఇంజనీర్ కిరణ్, ఇరిగేషన్ ఈఈ రవీందర్, డీఈ సుబ్బలక్ష్మి, టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఆదాయం రూ.13.49 కోట్లు

మెదక్ జిల్లాలో అత్యధికంగా తూప్రాన్‌లో రూ.6.35 కోట్లు, అత్యల్పంగా రామాయంపేటలో రూ.1.10 కోట్లు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ పథకంతో మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు పెద్దఎత్తున నిధులు సమకూరాయి. స్థలాల క్రమబద్ధీకరణ కోసం 2020లో అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రకటించిగా, ప్రస్తుత ప్రభుత్వం ఫీజుపై 25 శాతం రాయితీని ప్రకటించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 14,870 దరఖాస్తులకు గాను 4,770 మంది ఎల్ఆర్ఎస్ క్రింద ఆమోదం పొందారు. తద్వారా మొత్తం 13.49 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరింది. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో అత్యధికంగా 6,584 దరఖాస్తులు రాగా, ఇందులో 2,284 మంది డబ్బులు చెల్లిండంతో రూ.6.35 కోట్ల ఆదాయం సమకూరింది. మెదక్ మున్సిపాలిటీలో 3,821 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,237 మంది ఫీజు చెల్లించడంతో రూ. 4.27 కోట్ల ఆదాయం బల్దియాకు వచ్చింది. నర్సాపూర్‌లో 1,974 మంది దరఖాస్తులు చేసుకోగా, 644 మంది డబ్బులు చెల్లించడంతో రూ.1.77 కోట్లు వచ్చాయి. రామాయంపేట మున్సిపల్‌లో 2,491 దరఖాస్తులు రాగా, 605 మంది డబ్బులు చెల్లించడంతో 1.10 కోట్లు జమయ్యాయి.



మెదక్‌లో ఎల్ఆర్ఎస్ ద్వారా అనుమతి పొందిన స్థలం

మున్సిపాలిటీలకు ఉపయోగపడేనా?

ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా వచ్చిన నిధులను ఆయా మున్సిపాలిటీలకే కేటాయించాలని ప్రజలు, స్థానిక నాయకులు కోరుతున్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన నిధులను ఆయా మున్సిపాలిటీలకే ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. పట్టణ ప్రగతి పనులు, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులను కేటాయిస్తే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడుతున్నారు. ప్రాధాన్యతా క్రమంలో అత్యవసర పనులకు నిధులు కేటాయించాలని విన్నవిస్తున్నారు.



సంగారెడ్డిలోని గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి : సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సంగారెడ్డి మంజీర నగర్‌లోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, వంట సామగ్రి నాణ్యత, వంటశాల, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హాస్టల్‌లో డైనింగ్‌హాల్ మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

వచ్చే నెల 13న జాతీయ లోక్‌అదాలత్

మెదక్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శుభవల్లి

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న నిర్వహించే జాతీయ మోగా లోక్ అదాలత్‌ను క్షకిదారులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శుభవల్లి సూచించారు. మెదక్ కోర్టులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండేబుల్, చెక్‌బౌన్స్, బ్యాంకు రికవరీ, నష్టపరిహారం, కుటుంబ, వివాహ తగాదాలు తదితర కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి, మిలాద్-ఉన్- నబీ వేడుకలను శాంతియుతంగా, మతసామరస్యంతో జరుపుకోవాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

● జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి హేమలత

కౌడిపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ హేమలత హెచ్చరించారు. శనివారం కౌడిపల్లి మండలం తునికిలోని డాక్టర్ డి.రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఓల్డేజ్ హోంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నతనం నుంచి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సమాజానికి మంచిది కాదని ఆమె అన్నారు. అనంతరం ట్రస్టులో ఉంటున్న వృద్ధుల బాగోగులు, వారికి అందిస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కృష్ణ, కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ట్రస్టు డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాల్సిందే!

● బుస్సాపూర్ గ్రామస్థుల ఆందోళన
● రోడ్డుపై బైఠాయించి చెత్త వాహనాలను అడ్డుకున్న రైతులు
● 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తా
● మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హామీ


బుస్సాపూర్ గ్రామస్తులు,రైతులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం శివారులోని డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామస్థులు, రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారిపై బైఠాయించి చెత్త వాహనాలను అడ్డుకున్నారు. డంపింగ్ యార్డులోని చెత్త దుర్వాసనతో భూగర్భ జలాలు కలుషితమై మూగజీవాలు, చేపలు మృత్యువాత పడుతున్నాయని, తమ పిల్లలు అనారోగ్యాల పాలవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల క్రితం గ్రామస్థులను నమ్మించి డంపింగ్‌యార్డును ఇక్కడ ఏర్పాటు చేశారని, ఇప్పుడు తమ జీవితాలను కాలుష్యం కోరల్లోకి నెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వ్యర్థాలను కూడా ఇక్కడే వేయడం వల్ల కుక్కలు వాటిని రోడ్లపైకి, పంట పొలాల్లోకి లాక్కొచ్చి భయంకర వాతావరణం సృష్టిస్తున్నాయని వాపోయారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, తహసీల్దార్ స్వామి, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే డంపింగ్ యార్డు ఎప్పుడు తరలిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని గ్రామస్థులు పట్టుబట్టారు. డంపింగ్ యార్డు తరలింపు తన పరిధిలోని అంశం కాదని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఇదే విషయంపై బుస్సాపూర్, వరదరాజులపల్లి గ్రామస్థులు కొందరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద కూడా నిరసన తెలియజేస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.



సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశ వర్కర్ల ఆందోళన

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత అమలుపరచడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై విచారణ?

● పలు ఆరోపణలు చేస్తూ మంత్రికి సిబ్బంది లేఖ
● స్పందించిన రాజనర్సింహ.. విచారణాధికారి నియామకం

గజ్వేల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు మంత్రి ఆదేశించినట్లు తెలిసింది. ఆస్పత్రి సిబ్బంది సూపరింటెండెంట్‌పై ఆరోపణలు చేస్తూ మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాయడంతో స్పందించిన ఆయన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమించినట్లు తెలుస్తుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ గైనకాలజిస్టు కావడంతో ప్రతీ నెల ప్రసూతిల సంఖ్య తగ్గుతూ వస్తుందని, పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో కుమ్మక్కై నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారని లేఖలో ఆరోపించారు. గతంతో పోల్చితే నెలకు 55 డెలీవరీలు తగ్గాయని, ఇందుకు సూపరింటెండెంట్ మామూళ్ల వసూలే కారణమని పేర్కొన్నారు. దాదాపుగా రూ.16లక్షలు ఇప్పటివరకు ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల వద్ద పొందారని లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా గర్భసంచి ఆపరేషన్ల విషయంలోనూ స్పష్టంగా కుమ్మక్కు కనబడుతుందని, 2024లో 45 గర్భసంచి(కు.ని.) ఆపరేషన్లు జరిగితే ఈ ఏడాది కేవలం రెండు జరిగాయని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. సహకరించని సిబ్బందిని వేధిస్తున్నారని, ఈ క్రమంలో పలువురు వైద్యులు లాంగ్‌లీవ్‌లో వెళ్లివచ్చారని లేఖలో రాశారు. ఆస్పత్రిలో సదుపాయాలు లేవని సూపరింటెండెంట్ రోగులకు చెబుతూ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లేలా చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అన్నపూర్ణ వచ్చిన పిదపనే హైరిస్క్ కేంద్రాన్ని జిల్లా ఆసుపత్రి నుంచి మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారని అందులో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం పాలైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన లక్ష్మి(47) సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి అల్లుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి

చిన్నకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సైఫ్ అలీ కథనం ప్రకారం.. పెద్దకోడూరుకు చెందిన అనరాసి లక్ష్మి, సత్తయ్య దంపతుల చిన్న కుమారుడు రాజు(22)కు పుట్టుకతోనే మానసిక స్థితి సరిగా లేదు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు ప్రమాదవశాత్తు స్థానిక ఎల్లమ్మ ఆలయం సమీపంలోని నీటి గుంతలో పడ్డాడు. గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి గ్రామస్థుల సాయంతో గుంతలో నుంచి బయటకు తీసి చూడగా, రాజు అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తంగిలో నివాసం ఉంటున్న బసవరాజ్ (38) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడికి మద్యం అలవాటు ఉండటంతో భార్య మమతతో నిత్యం గొడవలు జరిగేవి. ఆదివారం రాత్రి భార్యను కొట్టడంతో ఆమె మనస్తాపానికి గురై ఇస్నాపూర్‌లో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన బసవరాజ్ సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు అంబాదాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పుస్తెలతాడు దొంగ అరెస్ట్, రిమాండ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని ఓడీఎఫ్ కాలనీ ద్వారకా నగర్‌లో ఆదివారం ఓ వృద్ధురాలిని బెదిరించి 5 తులాల బంగారు పుస్తెలతాడు దోచుకుపోయిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ సోమవారం వివరాలు వెల్లడించారు. ద్వారకానగర్‌కు చెందిన సండ హంసమ్మ ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో తన ఇల్లు ఊడుస్తుండగా ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి, వృద్ధురాలి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి బలవంతంగా మెడలోంచి రెండు వరుసల 5 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నాలుగు బృందాలుగా ఏర్పడి గాలించారు. నిందితుడు ఉపయోగించిన బైక్ ఆధారంగా సంగారెడ్డిలోని వసంతనగర్ కాలనీలో ఉంటున్న కౌకుంట్ల ప్రభాకర్‌గా గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేశ్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● నిజాంపేటలో ఎనిమిది మంది అరెస్ట్

నిజాంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,040 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నగరం తండా శివారులో సోమవారం అందిన సమాచారం మేరకు ఎస్.ఐ రాజేష్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. గత పదిహేను రోజుల క్రితం కూడా కల్వకుంట్ల, రజాక్‌పల్లి గ్రామాల్లో దాడులు చేసినప్పటికీ ఆగడం లేదు

అంగన్‌వాడీ కోడిగుడ్లలో పురుగులు

దౌల్తాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్ ద్వారా పంపిణీ చేసిన కోడిగుడ్లలో పురుగులు బయట పడ్డాయి. ఆదివారం గ్రామానికి చెందిన ఓ బాలింత అంగన్‌వాడీ నుంచి తెచ్చిన ఎనిమిది కోడిగుడ్లలో ఒక గుడ్డులో చిన్న పురుగులు కనిపించడంతో కంగుతింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారం ఇలా ఉంటే ఎలా అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


కోనాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో కోడిగుడ్డులో బయట పడ్డ పురుగులు





మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంటలో, రామాయంపేట మండలం కోనాపూర్‌లో రైతుల అవస్థలు

ఒక్క బస్తా కోసం...

తెల్లవారుజాము నుంచే పడిగాపులు
పోలీస్ పహారాలో యూరియా పంపిణీ
కొన్నిచోట్ల టోకెన్లు కూడా దక్కని దైన్యం
ఆగ్రహంతో నిరసనలు, ఆందోళనలు



హవేళిఘణపూర్‌లో వినాయకుడి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి.



దుబ్బాక సహకార సంఘం వద్ద రాత్రి నుంచే వేచిఉన్న రైతులు

సిద్దిపేట రూరల్/ చిన్నకోడూరు/కుకునూరుపల్లి/మిరుదొడ్డి/ చేర్యాల/మద్దూరు/బెజ్జంకి/దుబ్బాక/హవేళిఘణపూర్/మనోహరాబాద్ /శివ్వంపేట/చేగుంట/రామాయంపేట/నిజాంపేట/తూప్రాన్/హత్నూర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో సోమవారం సైతం రైతులకు యూరియా కష్టాలు తప్పలేదు. రైతులు వేకువ జాము నుంచే రైతు వేదికలు, ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల టోకెన్లు కూడా అందక రైతులు నిరసనలు చేపట్టారు. ఒక పాస్‌బుక్‌కు ఒకే బస్తా ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌ల వద్ద పోలీస్ పహారాలో ఎరువు బస్తాలను పంపిణీ చేశారు.

పరిస్థితి ఇలా..

● సిద్దిపేట రూరల్ పరిధిలోని పుల్లూరు, బండచేర్లపల్లి రైతు వేదికల వద్ద యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించగా, పాస్‌బుక్‌కు ఒక్క బస్తా మాత్రమే ఇచ్చారు.

● చిన్నకోడూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి, అల్లీపూర్ సొసైటీకి 560 బస్తాల చొప్పున యూరియా వచ్చింది. చిన్నకోడూరులో రైతు వేదిక వద్ద టోకెన్‌ల కోసం రైతులు గంటల తరబడి వేచి ఉన్నారు. కొంతమందికి టోకెన్‌లు రాకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్, ఎస్‌ఐ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

● మిరుదొడ్డిలో యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు రైతువేదిక వద్ద ప్రధాన రహదారిపై సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. పంట దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ సమతా సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. అయిన రైతులు వినకపోవడంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి.

● కుకునూరుపల్లి మండలానికి 25 టన్నుల యూరియా అందుబాటులోకి రాగా టోకెన్ విధానం ద్వారా పోలీసు పహారాలో రైతులకు అందజేశారు. మరింత యూరియా కోసం ఇండెంట్ పంపామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

● చేర్యాలలో యూరియా కొరతపై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. చేర్యాల పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూరియాను పంపిణీ చేశారు. రైతులు ఆరుబయట బారులు తీరకుండా రైతువేదికలో కూర్చొబెట్టి వరుస క్రమంలో పోలీస్ బందోబస్తు మధ్య టోకెన్లను అందజేశారు. రెండు ఎకరాలలోపు రైతులకు ఒక బస్తా, అంతకుమించి ఉన్నవారికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

● హవేళిఘణపూర్‌లో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వినాయకుడి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులకు ఎరువులను అందించేలా గణనాథుడు బుద్ధిచెప్పాలని వేడుకున్నారు.

● దుబ్బాక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా లారీలు వస్తున్నాయనే సమాచారంతో రైతులు ఆదివారం రాత్రి నుంచే దుప్పట్లు తెచ్చుకుని పడిగాపులు కాచారు. అరుగుల మీద పడుకుని, తెల్లవార్లు జాగరణ చేశారు. సోమవారం ఉదయం 550 బస్తాల యూరియా రాగా, దాదాపు 2వేల మంది రైతులు చేరుకున్నారు. ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు తాము పడిగాపులు కాచినందుకైనా రేపటి స్టాక్ కోసం టోకెన్‌లను అందించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు రైతులను సముదాయించారు.

● మద్దూరు మండలంలోని రేబర్తి సొసైటీ వద్ద యూరియా పంపిణీ కోసం పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఆధార్, పాస్‌పుస్తకాల ఆధారంగా 245 మంది రైతులకు 560 బస్తాలను పంపిణీ చేశారు.

● బెజ్జంకి పీఏసీఎస్ కార్యాలయం వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కట్టారు. భూ విస్తీర్ణం ఆధారంగా ఒకటి లేదా రెండు బస్తాలు పంపిణీ చేయగా, చాలామందికి యూరియా దొరకలేదు.

● మనోహరాబాద్ మండలంలోని గొల్లగడ్డ వద్ద ఉన్న ఎరువుల దుకాణానికి 350 బస్తాలు రాగా, పోలీసులు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో లారీ నుంచే నేరుగా రైతులకు పంపిణీ చేశారు. ఇవి కొంతమందికి మాత్రమే సరిపోగా, మిగతా రైతులు వెనుదిరిగారు.

● శివ్వంపేట మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం ముందు జాతీయ రహదారిపై తెల్లవారుజాము నుంచే రైతులు వరుసలో నిలబడ్డారు. 40 టన్నుల యూరియా పంపిణీ చేయగా, సుమారు 50 మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

● చేగుంటలో తెల్లవారుజాము నుంచే రైతులు పడిగాపులు కాశారు. యూరియా కోసం రైతు వేదిక వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● రామాయంపేట మండల పరిధి కోనాపూర్‌లో యూరియా కోసం రైతులు అరగంట పాటు రాస్తారోకో చేశారు. సొసైటీ వద్ద బస్తాల కోసం భారీ సంఖ్యలో గుమిగూడారు.

● నిజాంపేటలోని కల్వకుంట్ల గ్రామ పీఏసీఎస్ వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు.

● తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం రైతులు ఇక్కడికి ఉదయం 5 గంటలకే విచ్చేసి చెప్పులను లైన్‌లో పెట్టారు. తూప్రాన్ రైతు వేదికలో చెప్పుల క్యూలైన్లు కట్టిన రైతులు అక్కడ టోకెన్లు ఇవ్వడం లేదని తెలియడంతో గుండ్రెడ్డిపల్లికి వెళ్లిపోయారు.

● హత్నూరలో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు గుమిగూడగా, కొంతమందికి మాత్రమే సరఫరా అందడంతో ఆందోళనకు దిగారు.

బయో మందులు తీసుకుంటేనే యూరియా

● రైతులకు అంటగడుతున్న కొందరు ఫర్టిలైజర్ షాపు యజమానులు

టేక్మాల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పది ఫర్టిలైజర్ షాపులున్నాయి. యూరియా కావాలంటే అధిక ధర చెల్లించడంతో పాటు బయో మందులు కొనుగోలు చేయాల్సిందేనంటూ యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు రైతులు తెలిపారు. బయో మందుల విక్రయానికి ప్రభుత్వ అనుమతి ఉన్నప్పటికి వ్యాపారులు తమ స్వలాభం కోసం అవసరం లేకున్నా కొనాలని ఒత్తిడి తీసుకురావడంపై రైతులు మండిపడుతున్నారు. కొందరు అధికారుల అండతోనే రైతులను మోసం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఆగ్రోస్, డీసీఎంఎస్ షాపుల్లోను బలవంతంగా బయో మందులు అమ్ముతున్నట్లు వినికిడి. కొందరు డీలర్లు ఏకంగా తాము సూచించిన బయో మందులు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తాం లేకుంటే ఒక్క బస్తా ఇవ్వం ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ దబాయిస్తున్నారని రైతుల వాపోతున్నారు. దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బలవంతంగా కొనిపించడం తగదు

రైతులకు అవసరం లేని బయో మందులు బలవంతంగా కొనిపించడం తగదు. పీఏసీఎస్‌లలోనే యూరియా నిల్వలు ఉంచేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అధిక ధరలు, అవసరం లేని వాటిని కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్న వారిపై రైతులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటాం.
- మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్



మిరుదొడ్డిలో రాస్తారోకో చేస్తున్న రైతులు



చేర్యాలలో ఆందోళన చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు



మద్దూరు మండలం రేబర్తిలో పోలీస్ పహారా



చిన్నకోడూరులోని అల్లీపూర్ సొసైటీ వద్ద..



శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూ



మనోహరాబాద్ గొల్లగడ్డలో లారీ నుంచి పంపిణీ చేస్తున్న యూరియా బస్తాలు

మల్లన్న సన్నిధిలో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రత్యేక పూజలు



పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న ఎంపీ, ఆయన కుటుంబసభ్యులు

కొమురవెల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సందర్శించారు. సోమవారం ఆయన కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పట్నాలు వేసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొమురవెల్లి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని, భక్తుల కోసం గదుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆలయ ఈవో అన్నపూర్ణ ఎంపీ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, రాష్ట్ర నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు స్వరూప, తదితర నాయకులు ఉన్నారు.

సమానత్వమే సనాతన ధర్మం

● వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి రావత్
● తొగుటలో 151 మంది దళిత మాతృమూర్తులకు పాదపూజ



మాట్లాడుతున్న విశ్వహిందు పరిషత్ జాతీయ కార్యదర్శి రావత్

తొగుట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సమానత్వమే సనాతన ధర్మమని విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రావత్ అన్నారు. సోమవారం తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో జరిగిన సుహాసిని పాద పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందుత్వంలో అందరూ కలిసిమెలిసి అన్నదమ్ముల వలె జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా తొగుట మండలంలోని 151 మంది దళిత మాతృమూర్తులకు పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌స్వామీజీ, అంబికా శివయోగిస్వామిజీ, విశ్వత్మానందగిరిస్వామీజీ, వీహెచ్‌పీ నాయకులు మోహన్‌రావు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు సిద్దిపేట విద్యార్థులు ఎంపిక

సిద్దిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-15 బాలబాలికల వాలీబాల్ పోటీలకు సిద్దిపేట వాలీబాల్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు దుంపల శృతిక, వినయ్ వర్మ ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి వీరు జాతీయ స్థాయికి అర్హత సాధించినట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి వెంకట నరసయ్య తెలిపారు. కోచ్‌లు వీరారెడ్డి, ఈశ్వర్‌లను ఆయన అభినందించారు.

8 గంటల కరెంట్ కూడా ఇవ్వట్లేదు

విద్యుత్ కోతలతో రైతుల ఆందోళన
రేగోడ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన అన్నదాతలు

రేగోడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో వరి పంటలు ఎండిపోతున్నాయని రేగోడ్ మండలంలోని చౌదర్‌పల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు రేగోడ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా, కనీసం 8 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని రైతులు మండిపడ్డారు. పక్కనే ఉన్న సంగారెడ్డి జిల్లాలో 18 గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతోందని, తమకు మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇష్టానుసారంగా కరెంటు ఇస్తున్నారని ఆరోపించారు. తరచుగా విద్యుత్ ట్రిప్ అవడంతో బోరు మోటార్లు కూడా కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పోచయ్య సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్‌ను కలుస్తామని రైతులు తెలిపారు.



రేగోడ్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో పెట్టొద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వాటిని వెంటనే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 96 అర్జీలు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు డబ్బులు అడగకుండా చర్యలు తీసుకోవాలని హనుమన్ సుతార్తి సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా అప్పులు చేసి పనులు చేశామని, బిల్లుల కోసం మంత్రికి వినతి చేసేందుకు వెళ్లితే కేసులు పెట్టారని మాజీ ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సి బిల్లులు ఇప్పించాలని ప్రజావాణితో వినతి పత్రం అందజేశారు.



అర్జీదారు సమస్యను అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పోలీసు ప్రజావాణికి 12 ఫిర్యాదులు

మెదక్ అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణిలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అధికారులతో సమీక్ష

మెదక్ జిల్లా అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కారుణ్య నియామకాల విషయంలో అవసరమైన చెక్ లిస్ట్ తయారు చేసుకొని నిబంధనలు పాటిస్తూ.. భర్తీకి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు రుచి, పరిశ్రుభమైన ఆహారం అందించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నూతన అంగన్‌వాడీ భవనాల సముదాయాల నిర్మాణ ప్రిక్రయ ప్రారంభించేలా చూడాలన్నారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.34.88 లక్షలు

ఝరాసంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత 32 రోజులకు గాను ఆలయానికి రూ.34,88,120 ఆదాయం వచ్చినట్లు ఈవో శివరుద్రప్ప తెలిపారు.

వినతులు స్వీకరించిన సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌వో పద్మజరాణిలకు అర్జీలు సమర్పించారు. డీఎంహెచ్‌వో పరిధిలో 117 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుండయ్య, కార్యదర్శి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జేఎన్టీయూ కళాశాల ఆస్తిపన్ను చెల్లించడం లేదు

పుల్‌కల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆస్తిపన్ను చెల్లించడం లేదని కోర్పోలు గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వెళ్లిన వారు ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్యకు వినపతి పత్రం అందజేశారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు అందజేస్తున్న ఫిర్యాదుదారులు

న్యూస్ బాక్స్

రాజస్థాన్ గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే తనయుడు



రాజస్థాన్ గవర్నర్‌తో విక్రమ్‌రెడ్డి

పటాన్‌చెరు ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుమారుడు విక్రమ్‌రెడ్డి సోమవారం రాజస్థాన్ రాష్ట్ర గవర్నర్ శ్రీహరిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ మేరకు విక్రమ్‌రెడ్డి ప్రస్తుతం రాజస్థాన్‌లో ఉన్నారు.

ఇంద్రేశం కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం పురపాలక సంఘానికి మొదటి కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ పురపాలకశాఖ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఐడీఏబొల్లారం నుంచి బదిలీ అయ్యారు. ఇతర సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తికాకపోవడంతో పూర్తిస్థాయి విధులు చేపట్టడానికి రెండురోజుల సమయం పడుతుంది.

రైతు సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

నారాయణఖేడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తి రామకృష్ణ ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డీఏవో అనితకు వినతిపత్రం అందజేశారు.

పర్యావరణహిత గణనాథుల తయారీపై పోటీలు

నారాయణఖేడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహిత మట్టి, ఇతర సహజ వనరులతో తయారు చేసే గణనాథులపై నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ గురుకులాలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించే పోటీలను సబ్ కలెక్టర్ ఉమాహారతి నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని 14 గురుకులాల్లో ఈ పోటీలు ప్రారంభంకాగా.. 34 ఉన్నత పాఠశాలల్లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. మండల, డివిజన్ స్థాయిల్లో వినాయక ప్రతిమలు అందంగా తయారుచేసిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

జహీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ కళాశాలల అధ్యక్షుడు ఈశ్వర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్స్ రాకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

ఝరాసంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, స్థానిక ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అధిక ధరలకు మందులను విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి

పెద్దశంకరంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భాగ్యనగర్ తొలి మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపకుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని పెద్దశంకరంపేట మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కృష్ణస్వామి చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు.

'మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలి'

నర్సాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక పరిశీలకులు కిషన్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ జూనియర్ కాలేజీ సందర్శించి రికార్డులు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

గ్రంథాలయ ఆవరణలో గుంతలు పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఝరాసంగం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగం లోని గ్రంథాలయం ఎదుట గుంత ఏర్పడి వర్షపు నీటితో నిండిపోవడం వల్ల పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై ఆగస్టు 10న 'గ్రంథాలయానికి వెళ్లేదెలా' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఎర్రమట్టితో గుంతను పూడ్చి చదును చేశారు.

వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో

మట్టి గణపతులు పంపిణీ చేసిన నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : 'మట్టి గణపతే మహా గణపతి' అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య మట్టి గణపతులను ప్రజలకు ఉచితంగా అందజేశారు. వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ పర్యవేక్షణలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. అనంతరం తోపాజీ అనంతకిషన్ మాట్లాడుతూ ఏడేళ్లుగా మట్టి గణపతులను సరఫరా చేస్తూ పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములమవుతున్నమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, కోశాధికారి తోపాజి హరీష్, ప్రతినిధులు రాధాకిషన్, బుచ్చిలింగం, విజయ్, విద్యాసాగర్, సంతోష్, భాస్కర్, ప్రదీప్‌కుమార్, మహేందర్, మనోహర్, పాండురంగం, ప్రసాద్, రవీందర్, రాధాకృష్ణ, ఆమేటి కృష్ణ, కర్ణాకర్, సుధాకర్, శ్రీహరి, శ్రీనివాస్, శివరకుమార్, చంద్రశేఖర్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, మధు పాల్గొన్నారు.





మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, వాసవీ మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పేదలు సొంతింటి కలను నెరవేర్చుకోవాలి



తూప్రాన్ పట్టణంలో మట్టి వినాయక విగ్రహాల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకొని పేదలు సొంతింటి కల నెరవేర్చుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను, వెంకటరత్నాపూర్‌లో బ్రిడ్జి నిర్మాణ పనులు, అల్లాపూర్‌లో మట్టి వినాయక విగ్రహాల తయారీ, గోదాంలో రేషన్ బియ్యం పరిశీలించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ బృందం చేస్తున్న విగ్రహాల తయారీ పరిశీలించారు.

కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం : ఎంపీ



సభలో మాట్లాడుతున్న సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు కొనసాగిన దివంగత కిష్టారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కిష్టారెడ్డి 10వ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కిష్టారెడ్డి ఎంతో కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డి కుమారుడైన సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాంమహరాజ్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా, ఖేడ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ ప్రధాన నాయకులు, కిష్టారెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని పంచగామ గ్రామంలోని కిష్టారెడ్డి సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. స్థానిక అనురాధ కళాశాల ఆవరణలో కిష్టారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తల్లి గాళెమ్మ, సోదరుడు విఠల్‌రెడ్డి కుటుంబీకులతో కలిసి ఆవిష్కరించారు.

వడ్డెరుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తా

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మంజీరానగర్‌లో వడ్డెర సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి, అంజిరెడ్డి

అమీన్‌పూర్/పటాన్‌చెరు/రామచంద్రాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీఇచ్చారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మంజీరానగర్‌లో రూ.1.25 కోట్లతో నిర్మించిన సంక్షేమ భవనాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్న వడ్డెరులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సుమారు 1,500 గజాల స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించిన సంక్షేమ భవనంలో తక్కువ ఖర్చుతో వివాహది శుభకార్యాలు చేసుకునే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొల్లూరు మల్లేష్, గోపాల్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధి శాంతినగర్ కాలనీలోని పోచమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం వెలిమెలతండా సంత్ సేవాలాల్ మహరాజ్, భవానీమాత ఆలయాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే తెల్లాపూర్‌లోని సాయిబాబ కాలనీలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకుందాం

● జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సైదానాయక్

జహీరాబాద్/పటాన్‌చెరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పరస్పర సహకారంతో పండుగలను ప్రశాంతవాతావరణంలో జరుపుకుందామని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, పట్టణ సీఐ శివలింగం పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులు, ఆయా సంఘాల నాయకులు, వివిధ మతాలకు చెందిన పెద్దలు, పట్టణ ప్రముఖులు, సార్వజనిక్ ఉత్సవ కమిటీ నాయకులు, అధికారులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోదరభావంతో అందరం కలిసిమెలిసి పండుగలు జరుపుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. అందరం పరస్పరం సహకరించుకుని ఉత్సవాలు విజయవంతమయ్యేలా కృషి చేద్దామన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

'ఉర్సు'లో మంత్రి దామోదర్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దామోదర్ రాజనరసింహ

జోగిపేట రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అందోల్ మండల పరిధిలోని అన్నాసాగర్ దర్గాలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామెదర్ రాజనరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పీఠాధిపతుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

హామీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సిర్గాపూర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

కల్హేర్/సిర్గాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మధ్యపెడుతూ కాలం గడుపుతుందని సంగారెడ్డి ఎమ్మెల్యే, చింతా ప్రభాకర్ ఆరోపించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, ముఖ్యంగా రైతులకు అన్యాయం చేస్తూ పబ్బం గడుపుతుందని అన్నారు. రహదారులు అధ్వానస్థితికి చేరుకున్నా పట్టించుకునేవారే కరువయ్యాయన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ కాలంలో తమకు ఇబ్బందులు రాలేదని నేడు ప్రజలు భావిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ తాము సిర్గాపూర్‌లో ధర్నా చేపడుతామని ప్రకటించగానే ఎమ్మెల్యే భయపడి నల్లవాగు ప్రాజెక్ట్ సాగునీటిని సోమవారం ఉదయమే విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సిర్గాపూర్ మండల అధ్యక్షుడు సంజీవరావ్‌పాటిల్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

జహీరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని జిల్లా మహిళా సాధికారత అధికారి పల్లవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అంజమ్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ, మెప్మా అధికారి బసంత్‌రెడ్డి, డా.శేషురావు, హేమలత, ఎఫ్‌ఆర్‌వో సతీష్, జీఎస్ విశాల పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ భూములకు కబ్జాల గండం

(5వ పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ వ్యాపారులు హెచ్‌ఎండీఏ నుంచి వెంచర్ అనుమతులు తెచ్చుకున్నట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అవుటర్ రింగ్ రోడ్డు పక్కన రెండు ఎకరాలను కబ్జా చేశారు. రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకుని జీవో 59 కింద తమ భూములను క్రమబద్ధీకరించుకున్నారు.

అధికారుల అలసత్వం, నిఘా వైఫల్యం

ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. నగరంలో చిన్న స్థలం కబ్జా అయినా హడావుడి చేసే అధికారులు బొల్లారంలో జరుగుతున్న రూ.400 కోట్ల విలువైన భూమి కబ్జాను చూసీచూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. హెచ్‌ఎండీఏ భూములను కాపాడటానికి విజిలెన్స్, పోలీసులు, రెవెన్యూ విభాగాలు నిత్యం పర్యవేక్షిస్తుంటాయి. ప్రత్యేకంగా నలుగురు హెచ్‌ఎండీఏ అధికారులు నిత్యం పహారా కాస్తుంటారు. అయినప్పటికీ కబ్జాలు ఆగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి, అవినీతికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ కబ్జా వ్యవహారంలో ఉన్న అక్రమార్కులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షిస్తున్నాం

ప్రభుత్వ, హెచ్‌ఎండీఏ భూములు కబ్జా కాకుండా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నాం. ఆక్రమణలపై స్పష్టమైన ఫిర్యాదుతో వస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఎకరా భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తే అడ్డుకుని ప్రభుత్వ భూమి అని తెలియజేసేలా బోర్డు ఏర్పాటు చేశాం.

-దేవదాస్, జిన్నారం మండల తహసీల్దార్

వైద్యులు సమయపాలన పాటించాలి

● మెదక్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్

హవేళిఘణపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సేవలందించాలని మెదక్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. సోమవారం మండలంలోని సర్దన గ్రామంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో చేయాల్సిన జ్వర సర్వే గురించి వివరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఈగలు, దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీళ్లను తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హరిప్రసాద్, నవ్య, వినయ్ పాల్గొన్నారు.

బస్తీల్లో నీటి సమస్యల పరిష్కారం : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : బస్తీల్లో నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జలమండలి వారు నీటిని సరఫరా చేయకపోతే ప్రత్యామ్నాయంగా బోరు నీటిని సరఫరా చేసేటట్టు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేది పీఆర్టీయూనే

కల్హేర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే సత్తా ఒక్క పీఆర్టీయూ సంఘానికే ఉన్నదని రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మార్డి గ్రామంలో సోమవారం జరిగిన ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. సంవత్సరాల తరబడి ఉపాధ్యాయులకు సేవచేస్తున్న సంఘంలో సభ్యత్వం వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభు, ఎంఈవో శ్రీనివాసులు, కల్హేర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌రావ్, వంశీ, గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

'మద్యం దుకాణాలు కేటాయించాలి'

నారాయణఖేడ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల టెండర్లలో గీత కార్మికులకు 25 శాతం కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపి డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 25 శాతం మద్యం దుకాణాలను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు భూమాగౌడ్, జిల్లా, స్థానిక బాధ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రోత్సహిస్తాం : ఆదర్శరెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రోత్సహిస్తామని బీఆర్‌ఎస్ పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శరెడ్డి అన్నారు. సోమవారం కొల్లూరులోని డబుల్ బెడ్ రూం(కేసీఆర్ నగర్)లోని జిల్లా పరిషత్ పాఠశాలలోని ఒక విద్యార్థికి 6 పుస్తకాలు చొప్పున మొత్తం 2,500 పుస్తకాలు, అలాగే 8 రైటింగ్ బోర్డులను అందజేశారు. కాగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించే వరకు ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమిస్తే ముగ్గురు ఉపాధ్యాయులకు నెలనెలా వేతనం చెల్లిస్తానని బి.సాయిచరణ్‌గౌడ్, ఆదర్శరెడ్డి, మాజీ పీఎస్‌సీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఉమేష్ హామీఇచ్చారు. బీఆర్‌ఎస్ యువ నాయకులు చెన్నారెడ్డి ఫర్నిచర్ కోసం రూ.50వేలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాథోడ్, నాయకులు పాల్గొన్నారు.

'రామాయణాలు-సమాలోచన' ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్ర కళాశాల తెలుగుశాఖ ఆచార్యులు డా.జి.శ్రీనివాసరావు సంపాదకులుగా, డా.మఠపతి మాంతయ్య ఉపసంపాదకులుగా వెలువరించిన 'రామాయణాలు-సమాలోచన' అనే పీర్ రివ్యూడ్ భావవీణ ప్రత్యేక సంచికను ప్రిన్సిపాల్ డా.రమేశ్ సోమవారం ఆవిష్కరించారు. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ, మొల్ల, గోనబుద్ధారెడ్డి తదితర ప్రసిద్ధి చెందిన మహాకవులు రామాయణాన్ని తమ శైలిలో రచించారు. వీటన్నింటినీ పరిశోధనాపరంగా సమీక్షిస్తూ, విశ్లేషిస్తూ 19 ప్రత్యేక వ్యాసాలతో తెలుగుశాఖ ప్రచురించడం ఆనందదాయకమని ప్రిన్సిపాల్ అన్నారు.



సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు

రేషన్ డీలర్ల కమీషన్ విడుదల చేయాలి

రేషన్ డీలర్లకు రావాల్సిన ఐదునెలల కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు, పట్టణ అధ్యక్షుడు శశికాంత్ చందన్ కోరారు. ఈ విషయమై సోమవారం సంగారెడ్డిలో అదనపు కలెక్టర్ మాధురి, తహసీల్దార్ జయరాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



పెద్దశంకరంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రేషన్‌డీలర్లు

భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలో గోదావరి అంజిరెడ్డి, రైతులు, నాయకులు

జిన్నారం, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం, జంగంపేట గ్రామాల్లో హెచ్‌ఎండీఏ లే అవుట్ కోసం తమ విలువైన భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. సోమవారం జిన్నారంలో జిన్నారం, జంగంపేట గ్రామాలకు చెందిన రైతులు, బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ లే అవుట్ కోసం రెండు గ్రామాల రైతులు 180 ఎకరాల భూములు ఇవ్వగా, వారికి ఎకరాకు 600 గజాల స్థలాన్ని పరిహారం కింద మంజూరీ చేసి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పొజిషన్లు చూపలేదని మండిపడ్డారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు నర్సింగ్‌రావు, రాజిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించేందుకే ఆర్‌వో ప్లాంటు

నర్సాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన నీటిని అందించేందుకే ఆర్‌వో ప్లాంటును ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తన సొంత నిధులతో ఆర్‌వో మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇప్పటికే ఏర్పాటు చేయగా.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.